క్లుప్తంగా

నాగేశ్వరరావు కుటుంబానికి వితరణ



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం ఏలూరు పట్టణ పొగాకు పనివారల సంఘం అధ్యక్షుడు జోగి నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి సంఘం తరపున రూ.25 వేలు ఆర్థిక సాయం శనివారం అందించారు. నాగేశ్వరరావు మరణం పొగాకు పనివారల సంఘానికి, ఆయన కుటుంబానికి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. నాగేశ్వరరావు కుమారులు సుబ్రహ్మణ్యం, నాగరాజులను నాయకులు బండి వెంకటేశ్వరరావు, కార్యదర్శి పుప్పాల శ్రీనివాసరావు, కోశాధికారి చింతపల్లి కూర్మారావు, ఉపాధ్యక్షులు బరగడ పోతురాజు, ముఠా మేస్త్రి కాట్రు వెంకటేశ్వరరావు, దుకాణ యజమాని పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు.

మొక్కలు నాటిన ఇటలీ పర్యాటకులు



మొక్కలు నాటుతున్న ఇటలీ పర్యాటకులు బార్బారా, లూసియా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పర్యావరణ అసమతాల్యాన్ని నివారించేందుకు ప్రపంచమంతా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని ఇటలీ దేశం నుంచి భారత దేశ పర్యటనకు విచ్చేసిన పర్యాటకులు బార్బారా, లూసియాలు తెలిపారు. భారత పర్యటనలో భాగంగా శనివారం నగరానికి చేరుకున్న ఇటలీ పర్యాటకులు స్థానిక సెయింట్ ఆంథోని స్కూల్‌లో మొక్కలు నాటి స్ఫూర్తి నింపారు. పర్యావరణ అసమతౌల్యత కారణంగానే ప్రపంచంలోని పలు దేశాల్లో భూకంపాలు, సునామీలు, తుఫానులు, టోర్నడోలు, కొండచరియలు విరిగిపడడం వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి సహజంగా లభించే ఆక్సిజన్‌ను సైతం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమౌతోందన్నారు. ఇటువంటి వన్నీ సమర్థంగా ఎదుర్కోవడానికి, ఓజోన్ పొరను పరిరక్షించుకోవడానికి మొక్కలు నాటడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫాదర్ తోట అంతోని రాజు, సీహెచ్ కుమార్, యు.మోజెస్, తోడ ఎడ్వర్డ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సిబ్బంది కనిపించని బీపీ పరీక్షా విభాగం



నిత్యం రద్దీగా ఉండే ఓపీ ఇలా..



జనం లేక వెలవెలబోయిన వైద్య ఓపీ విభాగం

వెలవెలబోయిన జీజీహెచ్

కోల్‌కతా పీజీ ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారం ఘటనను నిరసిస్తూ వైద్యులు, వైద్య సిబ్బంది ఆందోళన చేపట్టడంతో ఏలూరు జీజీహెచ్ శనివారం వెలవెలబోయింది. ప్రతి నిత్యం రోగులతో కిటకిటలాడే జీజీహెచ్ ఓపీ విభాగం సైతం ఖాళీగా కనిపించింది. ఆందోళన సమాచారం తెలియక వైద్య కోసం వచ్చిన రోగులు ఇబ్బంది పడ్డారు. ఖాళీగా దర్శనమిచ్చిన జీజీహెచ్ విభాగాల దృశ్యాలివీ.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు

వైద్య విద్యార్థిని హత్యపై వెల్లువెత్తిన నిరసనలు

ఏలూరు (టూటౌన్): కలకత్తాలోని ఆర్జీకేర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికో విద్యార్థినిపై హత్యాచారం ఆపై హత్యను ఖండిస్తూ పీడీఎస్‌ఓ (ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం), స్త్రీ విముక్తి సంఘటన సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఏలూరులో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఫైర్ స్టేషన్ నుంచి కొత్త బస్టాండ్ మీదుగా తిరిగి ఫైర్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఫైర్ స్టేషన్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి, మెడికో విద్యార్థిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి ఎస్ మోహన్, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు టి.చిన్ని మాట్లాడారు. పీడీఎస్‌ఓ నాయకులు ఎం రాజా, అనుదీప్, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు కె.పద్మ, కల్యాణి తదితరులు నాయకత్వం వహించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మెడికో విద్యార్థిని హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామల రాణి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహకారం అందించాలని కోరారు.



పీడీఎస్‌ఓ, స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం



ఏలూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ

వారిని కఠినంగా శిక్షించాలి

వైద్య విద్యార్థినిపై హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా సమితి కార్యదర్శి మన్నవ యామిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ జూనియర్ డాక్టర్ల సంఘం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ వైద్యులు నగరంలో ఆందోళన చేశారు. వీరికి ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సంఘం అధ్యక్షురాలు పరకా శ్యామల, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు. ఏపీ మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఐఎంఏ మెడికల్ డాక్టర్ ఏఎస్ రామ్‌కు యూనియన్ నాయకులు తమ మద్దతు లేఖను అందజేశారు. బీవీ సత్యనారాయణ అధ్యక్షతన వహించారు.

వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కోల్‌కతా ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రైనీ వైద్యురాలిపై హత్యకు పాల్పడిన వారిని వెంటనే శిక్షించి, ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జి.కృష్ణ ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలకు భద్రత కల్పించాలన్నారు.

నేడు విద్యార్థులకు పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఏలూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాల, కళాశాల విద్యార్థులకు వేర్వేరుగా వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ఏలూరు శాఖ ప్రతినిధి రాధా వల్లభ దాస్ తెలిపారు. స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు చిత్రలేఖన పోటీలు, ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు వ్యాస రచన పోటీలు, 26వ తేదీ సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు చిన్నారులకు వేషధారణ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విజేతలకు ఈ నెల 26న జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో బహుమతులు అందజేస్తామని తెలిపారు.

మెడికల్ కాలేజీకి సీపీఎం నేత మృతదేహం అప్పగింత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వలవల శ్రీరామమూర్తి (93) మృతిచెందడంతో ఆయన మృతదేహాన్ని ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీకి కుటుంబసభ్యులు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మృతి పట్ల సీపీఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం తెలిపింది. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో దోమల నివారణ చర్యలు



దోమల నివారణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో ఆగస్టు నెలాఖరు వరకు చేపట్టిన స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగంతో 46వ డివిజన్‌లో శనివారం దోమల నివారణ చర్యలు చేపట్టామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మాలతి తెలిపారు. నగరంలోని పెన్షన్ లైన్, ఏటిగట్టు రోడ్డు, ఏఎస్ఆర్ స్టేడియం రోడ్డు, ఏఆర్‌డీజీకే స్కూల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ ఖలీల్ (వాహెద్), మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణు గోపాల్ స్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.చంద్రశేఖర్, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

జీతాల్లేక ట్రామాకేర్ సిబ్బందికి ఇబ్బందులు

- బిల్లులు చేసేందుకు అధికారుల నిర్లక్ష్యం
- చేతులు తడిపినా పనులు శూన్యం

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలో వైద్య సేవలే కాదు. వైద్య సిబ్బందికీ తిప్పలు తప్పటంలేదు. అత్యవసర సేవల విభాగంలో పని చేస్తోన్న సిబ్బందికి నెలల తరబడి జీతాలు లేకపోవటంతో అల్లాడిపోతున్నారు. కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆవేదనకు గురవుతున్నారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినా నేటికీ సిబ్బందికి జీతాలు అందకపోవటంతో వారంతా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం శూన్యమని, ఎవరూ తమ గోడు పట్టించుకోవటం లేదని వాపోతున్నారు.

సిబ్బందికి ఆర్థిక ఇబ్బందులు

ఏలూరు జీజీహెచ్‌లోని అత్యవసర సేవల ట్రామాకేర్‌లో పలు విభాగాలకు సంబంధించి 19 మంది టెక్నీషియన్లు, వైద్య సిబ్బంది సేవలు అందిస్తున్నారు. వీరంతా గత 15 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తున్నారు. గతంలో వైద్యవిధాన పరిషత్‌లో పని చేయగా, ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుతో బోధనాసుపత్రిగా వర్గోన్నతి పొందింది. ఈ నేపథ్యంలో డీఎంఏ నుంచి జీతాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల నాటి నుంచీ ఆరు నెలలుగా తమకు జీతాలు లేవని సిబ్బంది వాపోతున్నారు. ఒక్కో క్యాడర్‌ను బట్టి సుమారుగా రూ.25 వేలు నుంచి గరిష్ఠంగా రూ.40 వేలు వరకు జీతాలు పొందుతూ ఉంటారు. జీతాలు లేకపోవటంతో ఆర్థికంగా కష్టాలు పడుతున్నామని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఏలూరు సర్వజన ఆసుపత్రి (ఫైల్)

చేతులు తడిపినా..!

ట్రామాకేర్ యూనిట్‌కు అనుసంధానంగా వైద్య సిబ్బంది 19 మందికి జీతాల బిల్లులు హాస్పిటల్ అధికారుల ఆధ్వర్యంలోనే చేయాల్సి ఉంటుంది. జీతాలు నెలల తరబడి రాకపోవటంతో వారంతా సంబంధిత అధికారులకు భారీగా సొమ్ములు ముట్టజెప్పినట్టు తెలుస్తోంది. ఒక్కో సిబ్బంది సుమారు రూ.25 వేలు డబ్బులు బిల్లుల కోసం ఇచ్చినట్టు చెబుతున్నారు. సుమారుగా రూ.4.75 లక్షలు సంబంధిత వ్యక్తులకు ఇచ్చినా... అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా నేటికీ మాకు జీతాలు చెల్లించలేదని సిబ్బంది బావురుమంటున్నారు. ఏలూరు జీజీహెచ్‌లోని సిబ్బందికే జీతాలు ఇవ్వాలంటే భారీగా చేతులు తడపాల్సిన పరిస్థితి ఏర్పడితే.. ఇక రోగులకు ఏవిధంగా సేవలు అందుతాయోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఉన్నతాధికారులకు చెప్పినా ఫలితం లేదు

తమకు జీతాలు రాకపోవటంపై డీఎంఏలోని ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదని, ఎవరూ పట్టించుకోవటం లేదని ఏలూరు జీజీహెచ్‌లోని ట్రామాకేర్ సిబ్బంది వాపోతున్నారు. జిల్లా కలెక్టర్‌కు తమ సమస్యలపై ఫిర్యాదు చేస్తే తమను అధికారులు వేధింపులకు గురిచేసే ప్రమాదం ఉందని సిబ్బంది భయపడుతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి దృష్టి సారించి, విచారణ చేపట్టి సిబ్బందికి జీతాలు అందేలా చర్యలు తీసుకోవటంతోపాటు, అవినీతి సిబ్బందిపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	7,10
బెండకాయలు	24	కంద	50
పచ్చిమిర్చి	38	బీట్‌రూట్	36
కాకర కాయలు	30-36	కీరా దోస	46
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	64
బీరకాయలు (పందిరి)	40	అల్లం	100-160
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	36-56	పాలకూర	10
దొండకాయలు	44	చుక్కకూర	10
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	42-44	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	24-26	బఠాణీ	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	01
ఏలూరు - బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	20.15	03
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	01
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	00
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	01
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	02
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	01
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.00	98516	20
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.50	98509	29
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

ప్రభుత్వ విద్యారంగాన్ని దిగజార్చుతున్న ప్రభుత్వాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని రోజురోజుకూ దిగజార్చుతున్నాయని ఎస్ఎఫ్ఐ మాజీ అఖిల భారత అధ్యక్షుడు వైవీ ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమావేశాలు శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైవీ మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుంచి ఇప్పటివరకు విద్యారంగం కుంటుపడుతూనే వస్తోందన్నారు. మంచి విద్యను అందించడంలో ప్రభుత్వం వెనుకబడిందని ఆరోపించారు. దేశంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ కోల్‌కతాలో ఆర్‌జీ కర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగస్టు 9వ తేదీ రాత్రి డ్యూటీలో ఉన్న పీజీ రెండో ఏడాది చదువుతున్న మహిళా వైద్యురాలిపై అమానుషంగా, సామూహిక అత్యాచారం చేసి, పాశవికంగా హత్య చేసిన కేసులో సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కోల్‌కతా సంఘటనకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్న ఆర్ జీ కర్ వైద్య కళాశాల ఆసుపత్రి విద్యార్థులు, వైద్యులపై ఆగస్టు 14వ తేదీ రాత్రి రౌడీముకల దాడులను ఖండించారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి, సీబీఐ ఆధ్వర్యంలో త్వరితగతిన నేర పరిశోధన పూర్తి చేసి, నేరానికి పాల్పడిన వారిపై కఠిన శిక్షలు పడేలా చూడాలని, ఆసుపత్రుల్లో డ్యూటీలో ఉన్న వైద్యులకు, వైద్య సిబ్బందికి తగిన రక్షణ కల్పించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రత్యేక రక్షణ చట్టాలు కేంద్ర స్థాయిలో తీసుకురావాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న వైద్య సిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి కఠిన తరం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ పలు స్థాయిల నాయకులు పాల్గొన్నారు.

రామారావుగూడెంలో మేకలు, గొర్రెల చోరీ

దెందులూరు: రామారావుగూడెంలో పది మేకలు, గొర్రెలు శుక్రవారం రాత్రి చోరీకి గురయ్యాయని బాధిత రైతు కొత్తపల్లి వెంకటేశు కన్నీటిపర్యంతమయ్యాడు. పది మేకలు, గొర్రెలు కలిపి వాటి విలువ రూ. 10లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. శనివారం సాయంత్రం దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలను పట్టుకుని తన మేకలు, గొర్రెలు ఇప్పించి తన కుటుంబానికి జీవనాధారం కల్పించాలని వెంకటేశు కోరారు.

నిర్మానుష్యంగా స్టేడియం గ్రౌండ్



క్రీడాకారులు లేక బోసిపోయిన గ్రౌండ్

సెలవు వచ్చిందంటే ఇండోర్ స్టేడియం గ్రౌండ్ విద్యార్థులతో నిండిపోతుంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు క్రికెట్ ఆడుకోవడానికి ఈ గ్రౌండ్‌కు వస్తుంటారు. కానీ, క్రీడాధికారి చెప్పిన నిబంధనతో శనివారం గ్రౌండ్ నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది. క్రికెట్ ఆడుకోవడానికి వచ్చిన వారు వాకింగ్ ట్రాక్‌గా వినియోగిస్తున్న మార్గంలో వికెట్ల ఏర్పాటుకు రాళ్లు పెట్టడం, వాటిని తొలగించకుండానే వెళ్లిపోతుండటంతో వాకర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆడుకోవడానికి గ్రౌండ్‌కు రానివ్వకపోవడంతో విద్యార్థులు, క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు

స్పోర్ట్స్ కాంప్లెక్స్ షెడ్యూల్ సిద్ధం చేయాలి

దెందులూరు: నియోజకవర్గంలో అన్ని పాఠశాలల్లో ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు స్పోర్ట్స్ షెడ్యూల్‌ను సిద్ధం చేయాలని నియోజకవర్గ కోఆర్డినేటర్ జి.రాజగోపాల్, మండల కోఆర్డినేటర్ జక్కుల సురేష్‌కుమార్ అన్నారు. శనివారం గోపన్నపాలెం హైస్కూల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం హెచ్ఎం, చైర్మన్ ఎం మనోహర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కృష్ణారావు మాట్లాడుతూ సెప్టెంబర్ మొదటి వారంలో మండల స్థాయి గేమ్స్, రెండో వారంలో నియోజకవర్గ, మూడో వారంలో జిల్లాస్థాయి ఆటల పోటీలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

కేసుల పరిష్కారానికి సహకరించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సీ.పురుషోత్తమ కుమార్ న్యాయవాదులను కోరారు. శనివారం ఏలూరు బార్ అసోసియేషన్ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024లో ఇంతవరకు జరిగిన రెండు జాతీయ లోక్ అదాలత్‌కు న్యాయవాదులు సంపూర్ణ సహకారం అందించారని తద్వారా ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. రాజీ యోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ వివాదాల కేసులు, బ్యాంకు లావాదేవీల కేసులు, చిట్ ఫండ్ కేసులు పరిష్కరిస్తామన్నారు. ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొనే సీతారాం మాట్లాడుతూ బార్‌కు బెంచ్‌కు ఎప్పుడూ మంచి స్నేహపూరిత వాతావరణం ఉందని, ప్రతి న్యాయవాది తమ కేసులను పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో 8వ అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్ కుమార్, పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి ఎస్.ఉమాసునంద, ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అబ్బినేని విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు సీహెచ్‌సీకి బేబీ వార్మర్స్

దెందులూరు: దెందులూరు సీహెచ్‌సీకి ఆధునీకరణలో భాగంగా ఆరు బేబీ వార్మర్స్ మంజూరయ్యాయని సూపరింటెండెంట్ సుందర్‌బాబు అన్నారు. ఇప్పటి వరకు సీహెచ్‌సీలో అప్పుడే పుట్టిన చిన్నారులకు వార్మర్స్ సమస్య ఉండేదని, రూ.2.75 కోట్లతో ఆధునీకరణలో భాగంగా ఇంక్యూబెటర్లకు సైతం సీహెచ్‌సీకి వచ్చాయని, ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.